

జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల
గడువు రెండు నెలల పొడిగింపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని రెండు నెలలు పాటు జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు గడుపు పొడిగింపు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు జారీచేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా ఆదేశాలు జారీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం డిసెంబర్ 31, 2024 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేయుచున్న పాత్రికేయులకు మాత్రమే జనవరి 1 నుండి ఫిబ్రవరి 28 వరకు పొడిగింపు సౌకర్యం కొనసాగుతుందని తెలిపారు.

ప్రోటోకాల్ పాటించరా..!

- సమాచారం ఇవ్వకపోవడం దారుణం
- ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు
- వైసిపి ప్రజాప్రతినిధుల ధ్వజం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులను ఓట్లు వేస్తే గెలిచిన వారు అధికారిక కార్యాక్రమాలకు వైసిపి ప్రజాప్రతినిధులను ఆహ్వానించడం లేదు.. కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదంటూ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో తిరుపతి ఎంపి గురుమూర్తి, ఎంఎల్‌ఎ ద్వారకనాథరెడ్డి, జెడ్పిటీసి సభ్యులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీల్లో నిర్వహించిన సమావేశాలు, రెవెన్యూ సదస్సులకు కనీసం స్థానిక జెడ్పిటీసీలు, ఎంపిపిలకు సమాచారం ఇవ్వకపోవడం అత్యంత దుర్మార్గంగా ఉందని జిల్లాస్థాయి అధికారులు అధికార పార్టీకి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లాలో ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఏకపక్షంగా నిర్వహించడం వల్ల ప్రజా సమస్యలు వెలుగులోకి రావడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లు ద్వారా ఎన్నికైన ప్రజా ప్రతినిధులను విస్మరించడం సరికాదని ఫ్రోటోకాల్ విషయంలో జిల్లాస్థాయి అధికారులు అత్యంత నిర్లక్ష్యం వ్యవహరించడంపై తాము తీవ్ర అభ్యతరం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన చిత్తూరు ఎంపి దగ్గు మళ్ళ ప్రసాదరావు, తిరుపతి ఎంపి ఎం.గురుమూర్తి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో పాటు ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యం, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీ మోహన్, తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పి.ద్వారకనాథ్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ హిమావంశీ, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, తిరుపతి డిఆర్‌ఓ నరసింహులు, జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపిపిలు, జెడ్‌పిపి కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

అనంతరం వివిధ శాఖల ప్రగతిపై సమీక్షించారు. ఉమ్మడి జిల్లాలో పంట సాగు విస్తీర్ణం, గత సంవత్సరపు సాగు విస్తీర్ణం మొత్తం 59,244 హెక్టార్లు. ప్రస్తుత సాగు విస్తీర్ణం 61,956 హెక్టార్లు సాగు అయ్యింది. ఈ -పంట నమోదు ఇంతవరకు 17,012 ఎకరాలు, 8,038 మంది రైతులతో ఈ-చేయటం జరిగిందని వ్యవసాయశాఖ జేడి తెలియజేశారు. ఉద్యానశాఖ ప్రగతిని వివరిస్తూ



డిఆర్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

మామిడి, దానిమ్మ, టిస్యుకల్చర్ అరటి, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, నేరేడు, ఉసిరి, చింత, బత్తాయి, సీతాఫలము పంటల సాగు విస్తీర్ణం పెంచడానికి 40శాతం రాయితీ, పూలసాగు 50శాతం రాయితీపై చామంతి, బంతి, రోజా, సంపంగి సాగును ప్రోత్సహం అందిస్తున్నట్లు ఉద్యానశాఖ జేడి తెలిపారు. విద్యాశాఖ ప్రగతిని తెలియజేస్తూ డీఎస్సీ ద్వారా 2024 గాను 16347 టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయడం జరిగిందని, ఇందులో 1473 పోస్టులను చిత్తూరు జిల్లా కేటాయించిన్నట్లు తెలిపారు,. 2024-2025 విద్యా సంవత్సరంకు గాను ఉమ్మడి జిల్లాలో 4,738 పాఠశాలలలోని విద్యార్థులకు 35,34,824 పాఠ్యపుస్తకాలు జిల్లాలోని అన్నీ ప్రభుత్వ విద్యార్థులకు పంపిణీ చేయడము జరిగినది. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం జిల్లాలోని 2436 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో 1,41,217 మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. ఇందులో భాగంగా నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం వారానికి 5 గుడ్లు, 3 చిక్కీలు సరఫరా చేస్తుందని, సరికొత్త మేనూ 21వ తేదీ నుండి అమలు కోసం జిల్లాలో 4603 స్వయం సహాయక సంఘాలచే మధ్యాహ్న భోజన పథకం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గృహ నిర్మాణ సంస్థ ప్రగతిని తెలియజేస్తూ చిత్తూరు జిల్లాకు గాను 77,366 గృహాలను మంజూరు చేయడం జరిగిందని, వీటి ప్రాజెక్ట్ విలువ 1403.83 కోట్లు మంజూరు చేయడమైందని తెలిపారు. ఇప్పటి వరకు 48,654 గృహాలు పూర్తి అయ్యాయని, 69,672 ఇళ్లు వివిధ దశలలో నిర్మాణం జరుగుతుందని వాటికి గాను రూ.999.31 కోట్ల వ్యయం అయ్యిందని ఈ ప్రగతి 26 జిల్లాతో పోల్చితే చిత్తూరు జిల్లా మొదటి స్థానంలో ఉందని గృహనిర్మాణ శాఖ పీడి పద్మనాభం తెలిపారు. విద్యుత్ శాఖ ఆర్థిక సంవత్సరం 2023-24లో 97.69 కోట్ల వ్యయంతో కొత్తగా 4897 వ్యవసాయ సర్వీసులకు ఉచిత విద్యుత్ సరఫరా, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలో 2,38,025 మంది షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు వినియోగదారులు ఉన్నారని తెలిపారు. గతంలో ఇస్తున్న 50 యూనిట్లు సబ్సిడి స్థానంలో ప్రస్తుతం 200 యూనిట్లు సబ్సిడీ ఇవ్వడం జరుగుతోందని, తిరుపతి సర్కిల్‌లో కుటీర పరిశ్రమలైన 6015 మరమగ్గాలకు గాను 50శాతం రాయితీ మేర రాష్ట్ర ప్రభుత్వం 0.38 కోట్లు వెచ్చిస్తోందని విద్యుత్‌శాఖ ఎస్ఈ తెలిపారు. అలాగే సమగ్రశిక్షా అభియాన్, డ్వామా, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, స్త్రీ శిశు సంక్షేమశాఖ, సాంఘీక సంక్షేమశాఖల ప్రగతిపై సమీక్షించారు.

జిల్లాలో మూడు రోజుల సిఎం పర్యటన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 5, 6, 7వ తేదీలలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనకు జిల్లా అధికారులందరూ సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ మణికంఠ చందోలు, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరిలతో కలసి రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి వివిధ శాఖల అధికారులు విధుల కేటాయింపు నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కడా పిడి వికాస్ మర్మత్ ముఖ్యమంత్రి పర్యటన సంబంధించి వివరాలను వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కుప్పం పర్యటనలో భాగంగా 6,7 తేదీలలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనన్నున్నారని తెలిపారు. ఈపర్యటనలో భాగంగా హెలిపాడ్, బహిరంగ సభ సంబంధిత అంశాలకు సంబంధించి స్థలాలను పరిశీలించి నిర్ధారించ వలసినదని తెలిపారు. పిఎం సూర్యఘర్‌లో భాగంగా నడిమూరులో సోలారైజేషన్‌కు సంబంధించి ట్రాన్స్కో, నెడ్‌క్యాప్ అధికారులు వారి సర్వే ఇతరత్రా పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక, క్షేత్రస్థాయి పరిశీలనకు అవసరమైన ఏర్పాట్లను చేపట్టాలన్నారు. పర్యటనకు సంబంధించి ప్రతి శాఖకు వారిశాఖ పరిధిలో చేస్తున్న కార్యక్రమాల వివరాలపై సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ప్రతి శాఖకు అధికారికి కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని ఈ పనిలో ప్రతి ఒక్కరూ నిమగ్నమై కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సన్నద్ధం కావాలన్నారు. సమావేశంలో డీఎఫ్‌ఓ భరణి, డీఆర్‌ఓ మోహన్ కుమార్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పిఆర్‌ఎస్‌ఈలు విజయ్ కుమార్ రెడ్డి, విజయ్ కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, హౌసింగ్ పీడీ పద్మనాభం, జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, డ్వామా, డిఆర్‌డిఏ పిడి రవికుమార్, శ్రీదేవి, ట్రాన్స్కో, ఎస్ఈ ఇస్మాయిల్, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సుధారాణి డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి, వ్యవసాయ ఉద్యానవన పశుసంవర్ధక శాఖల అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్ రెడ్డి, డాక్టర్ ప్రభాకర్, డిఎల్‌డిఓ రవికుమార్ అధికారులు పాల్గొన్నారు.


సిఎం పర్యటనపై అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

మతసామరస్యాన్ని పాటిద్దాం..

2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదాం..
సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు పిలుపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా ప్రజానీకానికి సిపిఎం 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నదని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో గడపాలని కోరుతూ మంగళవారం చిత్తూరు నగరంలో వివిధ కాలనీలో శుభాకాంక్షలు తెలియజేస్తూ సిపిఎం నాయకులు కరపత్రాలు పంచడం జరిగింది. ఈ సందర్భంగా చంగల్రాయ మిట్టలో జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ స్వేచ్ఛ, సామరస్యం, సమానత్వం, ప్రజల నడుమ నెలకొని ఉన్నప్పుడే ఏ అభివృద్ధికైనా ప్రయోజనం సుస్థిరత తోడవుతాయని నిజమైన ప్రజాస్వామ్యానికి అర్థం ఇదే అని అన్నారు. కట్టుబొట్టు, ఆహారపు అలవాట్లు, కుటుంబ సంబంధాలు, సాంప్రదాయాలు, సంస్కృతి, మతవిశ్వాసాలు వంటి విషయాల్లో మన దేశంలోనూ, మన రాష్ట్రంలోనూ, జిల్లాలో కూడా ఎంతో వైవిధ్యం ఉందన్నారు. ఒకే దేశంలో ఇన్ని మతాలు పుట్టి పెరిగి విస్తరించిన వారసత్వం మరెక్కడ మనకు కనిపించదని అనేక రకాల అందమైన పూలతో తయారైన పుష్పగుచ్ఛం మాదిరిగా మన దేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగి ఉందన్నారు. అయితే ఇటీవల కాలంలో రాజ్యాంగం నిర్దేశించిన మార్గాన పురోగమనం వైపుగా దేశాన్ని నడిపించే బదులు ఆ విలువలకు తూట్లు పొడుస్తూ దేశాన్ని తిరోగమన దశలో నడిపించే ప్రయత్నాలు ముమ్మరం అవుతున్నాయని వీటికి బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వాటి ఆధీనంలో ఉండే వివిధ వ్యవస్థలు వారిని వెనుక నుండి నడిపిస్తున్న సంఘపరివారం తోడ్పాటు అందిస్తున్నాయని ఆరోపించారు. మత విశ్వాసాలను రాజకీయాన్ని దేనికి అదే వేరువేరుగా ఉండాలని అన్నారు. హిందూ దేవాలయాలపై ప్రభుత్వం జోక్యం వద్దని హిందువులే అధిపతులుగా ఉండాలని ప్రచారం చేస్తున్న మతోన్మాదులు అదే హిందువుల్లో 80శాతంగా ఉన్న దళిత, ఆదివాసి, బడుగు జనానికి మహిళలకు సమానత్వం ఇవ్వడానికి ఎందుకు నిరాకరిస్తున్నారని ప్రశ్నించారు. ఈ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడానికి ప్రజలు ప్రధాన సమస్యలను పరిష్కరించుకోవడానికి రాష్ట్రానికి ఉన్న హక్కులను సాధించుకోవడానికి మనమంతా సమైక్యంగా పాటుపడదామని, ఆ సమైక్యతకు విఘాథం కలిగించే భావోద్యోగాలను మన దరిచేరినివ్వద్దు కోరారు. జిల్లా ప్రజానీకానికి సిపిఎం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నదని తెలిపారు. సిపిఎం జిల్లా నాయకులు కే.సురేంద్రన్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

వరుస కథనాలకు స్పందన
రోడ్డు పరిశీలన


గుంతల రోడ్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు టౌన్: చిత్తూరు నగరంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉండడంపై ప్రజాశక్తి దినపత్రికలో వరుస కథనాలు ప్రచురించడంతో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, కలెక్టర్ సుమిత్ కుమార్, కార్పొరేషన్ మేయర్ అముత, కమిషనర్ నరసింహ ప్రసాద్ మంగళవారం రోడ్లను పరిశీలించారు. ప్రధానంగా కట్టమంచి మీదుగా తిరుత్తణి, పుత్తూరు, వెల్లే బైపాస్ రోడ్డు మరి అధ్వానంగా తయారైన విషయం గుర్తించారు. ఈ రోడ్డు కట్టమంచి చెంగలరాయమిట్ట, సాంబయ్య కండ్రిగ మీదుగా పుత్తూరు ప్రధాన రోడ్డు కలిసే రోడ్డు. దాదాపు నాలుగు కిలోమీటర్ల రోడ్డు మొత్తం పూర్తిగా పాడైపోయి గుంతలు గతుకులమయంగా తయారైంది. భారీ వాహనాలను నగరంలోకి అనుమతి లేకపోవడంతో ఈ బైపాస్ మీదనే చెన్నై ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితిఉంది. ఈ దారుణమైన రోడ్లలో వాహనాలు నడపడం డ్రైవర్‌కు పెద్ద సవాలుగా మారుతొంది. ఎక్కడ వాహనం బోల్తా పడుతుందోనని వణికిపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు రోడ్లపై సర్కస్ ఫీట్లు చేస్తూ తరచూ ప్రమాదాలకు గురి అవుతున్నారు. పాదచారులను వాహనదారులు ఎటు నుంచి వచ్చే ఢీకొంటారని హడలిపోతున్నారు. పరిస్థితులపై ప్రజాశక్తి వరుస కథనాల ప్రచురించడంతో ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు రోడ్లను పరిశీలించారు. వీలైనంత త్వరలో నిధులు సమకూర్చి ఆర్ అండ్ బి, కార్పొరేషన్, సమన్వయంతో రోడ్ల నిర్మాణానికి ప్రయత్నిస్తామని కలెక్టర్ ఎమ్మెల్యే తెలిపినట్లు స్థానిక నేతలు తెలిపారు. ఏ నిధులు వెచ్చించిన ఏ శాఖ వారు రోడ్డు వేసిన పరవాలేదు, వీలైనంత త్వరలో రోడ్డుపూర్తి చేసి వాహనదారుల, స్థానికుల సమస్యలు తీర్చాలని కోరుతున్నారు.

ఒరిజినల్ సర్టిఫికెట్లు తప్పనిసరి

రెండో రోజూ కానిస్టేబుళ్ళ ఎంపిక ప్రక్రియ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్టైఫండరీ కేడెట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ల దేహదారుఢ్య, సామర్థ్య పరీక్షలు చిత్తూరు జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ మైదానంలో మంగళవారం రెండవ రోజు కూడా పకడ్బందీగా కొనసాగాయి. రెండవ రోజు 600 మంది అభ్యర్థులకు గాను 403 మంది హాజరు కాగా వీరిలో 159 మంది తదుపరి రాత పరీక్షకు అర్హత సాధించారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు స్వీయ పర్యవేక్షణలో రెండవ రోజైన మంగళవారం సిబ్బంది, అధికారులు మరింత సమర్థవంతంగా పనిచేసి అభ్యర్థుల సామర్థ్యపు పరీక్షలను త్వరితగతిన ముగించారు. హాజరైన 403 మందికి సర్టిఫికెట్ల పరిశీలన, ఫిజికల్ మెజర్మెంట్‌లో భాగంగా ఎత్తు, ఛాతీ కొలిచారు. అనంతరం ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలు నిర్వహించగా 159 మంది తదుపరి ప్రక్రియకు ఎంపికయ్యారు. ఈ పరీక్షలు పటిష్టంగా జరిపించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మొదలు బయోమెట్రిక్ అథెంటికేషన్, ఫిజికల్ మెజర్మెంట్ పరీక్షలు, ఆర్ఎఫ్ఐడి ట్యాగుల పంపిణీ, ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలు (1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్) రిజల్ట్ కౌంటర్ వరకు కేటాయించిన విధులను సిబ్బంది పకడ్బందీగా నిర్వహించారు. ఇక పరుగు పందెంలో అలసిన అభ్యర్థులకు వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. భర్తీ పక్రియ పారదర్శకంగా, పూర్తిగా అభ్యర్థుల ప్రతిభ పాఠవాల ఆధారంగానే జరుగుతుందని, కావున అభ్యర్థులు, వారి తల్లితండ్రులు దళారులను, మధ్యవర్తులను నమ్మకుండా, మోసపోకుండా ఉండవలనని, ఎవరైనా భర్తీకి సహకరిస్తామని నమ్మబలికిన డయల్ 112కు గాని చిత్తూరు పోలీసు నెం. 9440900005కు గాని ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.


పరీక్షలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

పిహెచ్‌సి తనిఖీ చేసిన ఎమ్మెల్యే


ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సదుపాయాలపై డాక్టర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పేషెంట్లతో మాట్లాడుతూ డాక్టర్ల పనితీరు, సిబ్బంది సేవలు, ఓపి సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులు కొందరు ఓపి చీటీలు రాయడం లేదని చెప్పారు. దీనిపై పిహెచ్‌సిలో పనిచేస్తున్న డి.తేజ్ బాష గత కొంతకాలంగా విధులకు హాజరు కావడం లేదని, రోజు ఓపికి 150 నుంచి 200 మంది రోగులు వస్తుంటారని డాక్టర్ సాయిశ్రీ ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే అతన్ని తొలగించి అతని స్థానంలో మరొకరిని నియమించాలని ఆదేశించారు. అనంతరం నూతన హెల్త్ వెర్నర్ సెంటర్ నిర్మాణం కొరకు పిహెచ్‌సి పరిసరాల్లో స్థలపరిశీలన చేశారు. స్థలం సరిపోకపోవడంతో పాత బిల్డింగ్ ఉన్న స్థలంలోనే కొత్త బిల్డింగ్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట టిడిపి మండల అధ్యక్షులు కిషోర్ గౌడ, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి, భువన చంద్ర గౌడ్ ఉన్నారు.

ఎమ్మెల్యే చేతుల్లో మీదుగా పలు ప్రారంభోత్సవాలు

బైరెడ్డిపల్లి పంచాయతీలోని చీలంపల్లెలో గోకులం షెడ్‌ను ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో వోల్టేజ్ సమస్య పరిష్కారంలో భాగంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్‌ను, ఎన్టీఆర్ సుజల స్రవంతి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. బైరెడ్డిపల్లి రెవెన్యూ సదస్సులో పలువురు లబ్ధిదారులకు కొత్త పింఛన్‌లను పంపిణి చేశారు. తహాశీల్దార్ మాధవరాజు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కృషి


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల జీవితాలల్లో వెలుగులు నింపుతోందని ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. మంగళవారం చెన్నమ్మ గుడిపల్లె, మిట్టపల్లి గ్రామీణ ప్రాంతాల్లో పింఛను లబ్ధిదారులందరికీ పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నగర పాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు. ఈసందర్భంగా స్థానిక ప్రజలు ఎంపీ, ఎమ్మెల్యేలకు దృష్టికి సమస్యలను తీసుకెళ్లగా వారు సానుకూలంగా స్పందించి, వినతిపత్రాలను స్వీకరించారు. కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి సమస్యకు పరిష్కారం లభించనుందని తెలిపారు.

మండలంలో 98 శాతం పింఛన్ల పంపిణీ: ఎంపీడీవో

సోమల: మండలంలో మంగళవారం 15 పంచాయతీల పరిధిలో 98 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్టు ఎంపీడీవో నారాయణ తెలిపారు. ఉదయం 5 గంటల నుండి సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీకి వారికి కేటాయించిన పరిధిలో వెళ్లి పంపిణీ ప్రక్రియను ప్రారంభించారని మండలానికి 7233 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. మండల ప్రజలకు ప్రజాప్రతినిధులకు అధికారులకు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

పలమనేరు: మున్సిపాలిటీలో 97శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేసినట్లు కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అన్ని వార్డులు, సచివాలయ సెక్రటరీలు ఇంటింటికీ వెళ్లి ఉదయం నుంచి పింఛన్లు అందజేసినట్లు తెలిపారు. మొత్తం 4581 మందికి గాను 4440 మంది లబ్దిదారులకు 97 శాతం పెన్షన్ పంపిణీ చేసినట్లు తెలిపారు.

జాప్యం లేకుండా వితంతు పింఛన్లు : ఎమ్మెల్యే గురజాల

చిత్తూరుఅర్బన్ : ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పథకంలో భాగంగా స్పౌజ్ క్యాటగిరి పింఛన్లను ఏ నెలకు ఆ నెలే మంజూరు చేసి పంపిణీ చేయాలనే నిర్ణయం లబ్ధిదారులకు వరం లాంటిదని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల కార్యక్రమంలో భాగంగా మంజూరైన కొత్త వితంతు పెన్షన్లను మంగళవారం చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని సీజీపల్లి, బండపల్లిలో లబ్ధిదారులకు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావుతో కలిసి పంపిణీ చేశారు.

రొంపిచర్ల: పుంగనూరు నియోజకవర్గ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి రొంపిచర్ల మండలం బొమ్మయ్యగారి పల్లి పంచాయతీ, పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ ఎస్టీకాలనీలోనీ లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. నియోజకవర్గ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుబ సంస్థ డైరెక్టర్ ఉయ్యాల రమణ, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్ లో మెరిసిన హారిక



ప్రజాశక్తి- వి కోట: చిత్తూరులో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో వీకోట మండలం గోనుమాకుల పల్లె జడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని హారిక జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. విద్యార్థిని తయారు చేసిన 'యూటర్న్ సిగ్నలింగ్' అనే ప్రదర్శనకు ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు వెంకటరమణరెడ్డి, సైన్స్ టీచర్ వెంకటరెడ్డిని తెలిపారు. విద్యార్థిని హారికను ఉపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు అభినందించారు.

తాగునీటి సమస్య పరిష్కారం


గ్రామంలోని రోడ్లను పరిశీలిస్తున్న ఎంపిడిఓ హరిప్రసాద్

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామపంచాయతీ పరిధిలోని చెన్నారెడ్డి ఎస్టీ కాలనీలోని తాగునీటి సమస్యలను పరిష్కరించినట్లు ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఎస్టీ కాలనీలో నూతనంగా పైప్ లైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. అనంతరం వేపంజేరి దళితవాడ, గుర్రప్పకండిగ గ్రామాలను సందర్శించి వీధులలో మురికి నీరు నిలిచిపోవడంతో వెంటనే తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఎంపీడీవో ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఈశ్వర్, వేపంజేరి సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శారీరక దృఢత్వానికి నడక మంచిది..



ఫిట్ ఇండియా కార్యక్రమంలో ద్రావిడ విశ్వవిద్యాలయ అధికారులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: శారీరక దృఢత్వానికి నడక ఒక మంచి మార్గమని ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య దొరస్వామి తెలిపారు. ద్రావిడ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా విశ్వవిద్యాలయ అధ్యాపకులు, సిబ్బందితో కలిసి యామనూరు వరకు నడిచారు. అనంతరం ఉపకులపతి మాట్లాడుతూ మనుషులు వ్యాయామం చేయడం వల్ల, నడవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి ఒక్కరూ రోజుకు 30 నుంచి 60 నిమిషాలు నడవడం వల్ల మనిషి మానసికంగా, శారీరకంగా బలంగా ఉంటారని తెలిపారు. కులసచివులు ఆచార్య కిరణ్ కుమార్, ఫిసికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య శ్రీనివాస కుమార్, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

డీఐఓ హనుమంతరావు


వ్యాధి నిరోధక టీకాల వేశారా అని అడిగితే తెలుసుకుంటున్న డిఐఓ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు ఎంతో అవసరమని జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి హనుమంతరావు తెలిపారు. మంగళవారం గంగాధర నెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డిఐఓ చిన్నారులకు ప్రభుత్వ వైద్యుల ద్వారా అందిస్తున్న టీకాల వివరాలను పరిశీలించారు. 0-5 సంవత్సరాలలోపు పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెంపొందించడానికి అవసరమైన టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ఎదురుగా గుడిసెలలో నివాసం ఉంటున్న చిన్నారులకు టీకాలు అందజేసే విధానంపై పరిశీలన జరిపి సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ దుర్గాదేవి, సిహెచ్ఓ శ్రీనివాసులు, శైల, ధర్మేంద్ర, ఢిల్లీ కుమార్, రవి, సూపర్వైజర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అమర్‌ను సన్మానించిన పూతలపట్టు ఎమ్మెల్యే



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని పూతలపటు ఎమ్మెల్యే మురళీమోహన్ మంగళవారం పార్టీ కార్యాలయంలో కలిసి సన్మానించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ముందస్తుగా శుభాకాంక్షలు తెలియజేసి ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా కాణిపాక వరసిద్ధి వినాయకుని దర్శనానికై విచ్చేసి ప్రత్యేకపూజలు పాల్గొనాలని ఆహ్వానించారు. ఆయనతో పాటు నాయకులు వెంకటేష్ చౌదరి, ఆర్వీ బాలాజీ తదితరులు ఉన్నారు.

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రారంభం

యువ శాస్త్రవేత్తలను తయారు చేయడమే లక్ష్యం: ఎంపి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విద్యార్థులను యువ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. మంగళవారం చిత్తూరులోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలను ఎంపి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శన వేదికగా నిలుస్తాయని అన్నారు. చిన్నపిల్లలు అయినా గొప్ప ఆలోచనలతో తమ ఆవిష్కరణలను ప్రపంచానికి చాటి చెప్పడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆవిష్కరణలు అనేవి ప్రజల సమస్యలు, అవసరాలు తీర్చేవిగా ఉండాలని, అప్పుడే ప్రజలకు ఉపయోగపడటమే కాకుండా అవిష్కరణలకు గుర్తింపు వస్తుందన్నారు. విద్యార్థులు తమ ఆలోచనలకు మరింత పదును పెట్టాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి సులువైన యాంత్రిక పరికరాలు ఉపయోగపడే విధంగా ఆవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కెటాయించడమే కాకుండా, ఆధునిక యుగానికి అనుగుణంగా విద్యారంగ సంస్కరణలను తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ బడుల అభివృద్ధికి వెచ్చించిన నిధులను విద్యాశాఖ అధికారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి దశలోనే వారి సృజనాత్మకతకు పదునుపెట్టేలా విజ్ఞానంపై అవగాహన కల్పిస్తూ కొత్త ఆవిష్కరణలు చేసేలా ప్రోత్సాహం అందించాలని పేర్కొన్నారు. నగర మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో మాట్లాడుతున్న ఎంపి

పుష్పగుచ్ఛాలు, కేకులు వద్దు : కలెక్టర్

చిత్తూరుఅర్బన్: భారతదేశ మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి మరణానికి సంతాపంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2024 డిసెంబర్ 26 నుండి 2025 జనవరి 1 వరకు ఏడు రోజుల పాటు సంతాప దినాలుగా ప్రకటించినందున వివిధ శాఖల జిల్లా అధికారులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను ఖచ్చితంగా, ఎలాంటి ఆటంకం లేకుండా పాటించాలని జిల్లా కలెక్టరేట్ అధికార వర్గాలు పేర్కొన్నారు. అలాగే ఒకటో తేదీన నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు గాని, కలెక్టర్ వారి వద్దకు గానీ అధికారులు, ఇతరులు ఎటువంటి పుష్పగుచ్ఛాలు, కేకులు తీసుకుని రావొద్దని కోరారు.

ఆకట్టుకున్న 2025 దోస



ప్రజాశక్తి- విజయపురం (నగరి) : నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ దేశమ్మ దేవాలయం సమీపం గల సీఎస్‌కే హోటల్‌లో మంగళవారం 2025 ఆకారంలో దోస వేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ దోసను పలువురు ఆసక్తిగా తిలకించారు.

గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): మండలంలోని దామరపాకం గ్రామంలో పోలీసులు మంగళవారం రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. డీజీపీ ఆదేశాల మేరకు నేరరహిత రాష్ట్రంగా మార్చే ప్రక్రియలో భాగంగానే దామరపాకం గ్రామంలో దాతల సహకారంతో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని సీఐ మహేశ్వర్ తెలిపారు. గ్రామస్తులు సహకారం అందిస్తే ప్రతి గ్రామంలోని కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

హక్కుల గురించి తెలుసుకోవాలి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ప్రతి పౌరుడు హక్కుల గురించి తెలుసుకోవాలని తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని పాలేరు దళితవాడలో పౌరహక్కుల పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి నెల చివరి తేదీ దళితవాడల్లో పౌరహక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అణగారిన వర్గాలను మేల్కొలిపేందుకు, అగ్రవర్ణాల వారి దాడులను అరికట్టేందుకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏఎస్ఐ రామచంద్రారెడ్డి ఆర్ఐ మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి ఆషాజి లేఖ, వీఆర్ఓ సుబ్రహ్మణ్యం, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రీ సర్వే పై అవగాహన ర్యాలీ



ప్రజాశక్తి- గుడిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన రీసర్వే, భూ సమస్యలు పరిష్కారం కొరకు ప్రారంభిస్తున్న ఈ సర్వే మంగళవారం వేంగేపల్లి గ్రామంలో రెవెన్యూ శాఖ, మండల సర్వే రత్నప్ప ఆధ్వర్యంలో ప్రారంభించారు. సర్పంచ్ నారాయణ, పంచాయతీ టిడిపి అధ్యక్షుడు విజయ్ కుమార్, వీఆర్వోలు, గ్రామస్తులు పాల్గొన్నారు

బాల్యం నుంచి పౌష్టికాహారాన్ని అందించండి

పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కుప్పంటౌన్: బాల్యం నుంచి పౌష్టిక ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని కుప్పం పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. కుప్పం టేలర్ హైస్కూల్‌లో పూర్వపు విద్యార్థుల సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ సురేష్‌బాబు అధ్యక్షతన ఫుడ్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కుప్పం పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి పౌష్టికాహారాన్ని తీసుకొని బలంగా ఎదగాలని సూచించారు. అనంతరం పాఠశాల పూర్వపు విద్యార్థుల సంఘం సభ్యులతో కలిసి విద్యార్థులు ప్రదర్శించిన ఆహార పదార్థాలను పరిశీలించి, వాటిని రుచి చూసి విద్యార్థులను మెచ్చుకున్నారు. దయానిధి, సుదర్శన్, హఫీస్, అజిత్, ప్రమోద్, శరవణ, మునఫ్, రూబీ, నాగర్జున, అహ్మద్ బాషా, సురేష్ కుమార్, తౌసిఫ్, భాగ్యరాజ్, రియాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఫుడ్ ఫెస్ట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస రావు

సంక్షేమ ఫలాలు అందించడంలో ముందుండాలి: ఎంపిడిఓ


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఓ బాలాజీ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: సచివాలయ ఉద్యోగస్తులందరూ అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించడంలో ముందుండాలని ఎంపీడీవో బాలాజీ సచివాలయ సిబ్బందికి సూచించారు. మంగళవారం లింగాపురం సచివాలయాన్ని ఆయన సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది ఉదయం సకాలంలో హాజర్వడంతోపాటు, సాయంత్రం వరకు ఉండి సాయంత్రం ఆన్లైన్లో హాజరు నమోదు చేయాలని సూచించారు. అంగన్వాడీ పిల్లలకు ఆధార్ కార్డులు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతులు వారి వివరాలతో ఈ కేవైసీ పూర్తి చేసుకోవడం తప్పనిసరి అని, ఈ సర్వే కార్యక్రమాన్ని 100శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ రుద్రమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముందస్తు నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: మంగళవారం లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ సతీమణి గురజాల ప్రతిమ హాజరై కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టి శుభాకాంక్షలు తెలిపారు.

సోమల: 2025 ఆంగ్ల నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు, నియోజకవర్గ బిజెపి అధ్యక్షులు గన్నా మదన్మోహన్ బాబు, జనసేన మండల అధ్యక్షులు నాగభూషణ్ రాయల్, టిడిపి నాయకులు చంద్రశేఖర్ నాయుడు, పీఎం మల్లికార్జున, బాలకృష్ణ నాయుడు, సతీష్, వినోద్ కుమార్, మణి, ఉమాపతి నాయుడు, సదాశివయ్య, శ్రీనివాసులు నాయుడు, మహేంద్ర బాబు, భానుప్రకాష్ నాయుడు, హరి ప్రసాద్ నాయుడు, శంకర మండల ప్రజలకు అధికారులకు ఆయా పార్టీల శ్రేణులకు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ముస్తాబైన ఆలయాలు

నూతన సంవత్సరం పురస్కరించుకొని మండలంలోని అన్ని దేవాలయాలలో భక్తుల రద్దీ దృష్ట్యా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కందూరు, సోమల, నెల్లిమంద, కమ్మపల్లి, పెద్దఉప్పరపల్లి గ్రామాలలోని వైష్ణవ, శివాలయాలలో భక్తుల సందర్శనార్థం రాత్రి 12 గంటల నుండి ఆలయాన్ని తెరిచి ఉంచనున్నట్లు తెలిపారు.

నేడు మాజీ మంత్రి పర్యటన

మాజీ మంత్రి పుంగనూరు నియోజకవర్గ శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జనవరి ఒకటవ తేదీ సోమల మండలంలోని దుర్గం కొండ గార్గేయ స్వామి వారిని దర్శించుకోనున్నట్లు ఆ పార్టీ శ్రేణులు తెలిపాయి.

ప్రశాంతంగా న్యూఇయర్ వేడుకలు : సిఐ

వెదురుకుప్పం: నూతన సంవత్సరం సందర్భంగా యువత మద్యం తాగి వాహనాలు నడపరాదని, అల్లర్లకు పాల్పడడం, గొడవలు చేయడం వంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని కార్వేటినగరం సిఐ హనుమంతప్ప తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంతోషాలు పంచే ఏడాది కావాలి

విజయపురం (నగరి) : నూతన సంవత్సరం ప్రజలందరికీ ఆనందాన్ని పంచాలని మాజీ మంత్రి ఆర్కే రోజా ఆకాంక్షించారు. మంగళవారం నియోజకవర్గ ప్రజలకు ఆమె నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో మంగళవారం నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. జడ్జి విష్ణువర్మ కేక్‌ను కట్‌చేసి అందించగా అందరూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


ఉత్సాహంగా నూతన

రొంపిచర్ల: పులిచెర్ల మండలం కల్లూరు జెడ్పి హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు ప్రకాష్ ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. విద్యార్థులందరూ ఉపాధ్యాయులతో కలిసి పచ్చటి మొక్కలతో వేడుకలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

కార్వేటినగరం: మండల కేంద్రంలో ప్రఖ్యాత విద్యాసంస్థ శ్రీలక్ష్మీనరసింహ కళాశాలలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలను విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణాన్ని రంగవల్లులతో సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే విద్యార్థులకు వివిధ రకాలైన ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందించారు.కళాశాల డైరెక్టర్ దిలీఫ్ కుమార్ కేక్ కట్చేసి, అందరికి నూతన సంవత్సరం శుభా కాంక్షలు తెలియజేశారు. ప్రిన్సిపాల్ జమున, శరవణ, ఉపాధ్యాయులు వేణుగోపాల్, భవాని, శ్రీను పాల్గొన్నారు.


చిత్తూరులో..

యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ


విజయపురంలో..

ప్రజావక్తి- విజయపురం (నగరి) : యూటీఎఫ్ 2025 డైరీ, క్యాలెండర్, జీవో బుక్, ఎస్ఎస్‌సీ స్టడీ మోడల్ పేపర్స్‌ను మంగళవారం ఆర్డీవో భవాని శంకరి ఆవిష్కరించి సంఘసభ్యులకు అందజేశారు. ఈనెల జనవరి 5,6,7,8 తేదీలలో కాకినాడలో రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలను జరుపుకుంటున్నదని, ఉపాధ్యాయులు, విద్యారంగ మేధావులు మహాసభలకు హాజరై జయప్రదం చేయాలని రాష్ట్ర కౌన్సిలర్ మునిరత్నం, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు వంశీకృష్ణ, రవీంద్రబాబు, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, యువరాజ్, ప్రకాష్, సంతోష్, సురేష్ బాబు, హరి ప్రసాద్, విజయ్ కుమార్, భాగ్యరాజ్, పయని కోరారు.


యాదమరిలో..

యాదమరి: పిఆర్‌టియు క్యాలెండర్, డైరీలను మండల విద్యాశాఖ అధికారులు రుక్మిణమ్మ, హెచ్ఎల్ఎన్.ప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి తీసుకెళ్లే బాధ్యత ప్రతి ఉపాధ్యాయులపై ఉందన్నారు. రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి, జిల్లా ఉపాధ్యక్షులు హిమబిందు, షహనాజ్, మండల అధ్యక్ష కార్యదర్శులు శివప్రసాద్, మోహన్ కుమార్, సురేష్ రెడ్డి, ఆనంద పిళ్లై, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఎస్టియు డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతరం ఎస్‌టియు డైరీ, క్యాలెండర్‌ను కూడా ఎంఈవోలు రుక్మిణమ్మ, ప్రసాద్ ఆవిష్కరించారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్, జిల్లా అధ్యక్షులు మదన్మోహన్ రెడ్డి, నాయకులు గుణశేఖర్, రమేష్, అరుణ్‌కుమార్, గణపతి, రంగనాథం పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని నెల్లెపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలని సుబ్బరత్నమ్మ, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఆచారి, ఉపాధ్యాయులతో కలిసి తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఉపాధ్యాయులు రవికుమార్, రామ్మూర్తి, భాను ప్రసాద్, వాసు దేవ నాయుడు, పద్మజ, లలిత, సరోజిని పాల్గొన్నారు

కుప్పం ఇంజనీరింగ్ కళాశాల క్యాలెండర్ ఆవిష్కరణ



కుప్పం టౌన్: కుప్పం ఇంజనీరింగ్ కళాశాల తరపున నూతన సంవత్సర క్యాలెండర్‌ను, బ్రోచర్‌ను జేఎన్‌టియు వైస్ ఛాన్సులర్ సుదర్శన రావు మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కుప్పం ఇంజనీరింగ్ కళాశాల స్వయం ప్రతిపత్తిని సాధించడం ఎంతో ఆనందించదగ్గ విషయమన్నారు. కళాశాల స్వయంగా పాఠ్యాంశాలను తయారు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. మారుమూల ప్రాంతమైన కుప్పంలో ఇంజనీరింగ్ కళాశాల ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని, విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందిస్తోందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకరబాబు, మెకానికల్ డిపార్ట్మెంట్ హెచ్ఓడి గణేష్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

చిరుత పిల్ల మృతి


మృతి చెందిన చిరుత పిల్ల

ప్రజాశక్తి- వి కోట: వి కోట – పేర్నంబట్ ప్రధాన రహదారిలోని నాయకనేరి అటవీ ప్రాంతంలో ఓ చిరుత పులి పిల్లను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందింది. మంగళవారం తెల్లవారు జామున నాలుగున్నర గంటలకు అటుగా వెళుతున్న వాహనదారులు రోడ్డుపై మృతి చెంది పడి ఉన్న చిరుత పులి పిల్లను గమనించారు. సమాచారం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకోగా అక్కడున్న చిరుత పిల్ల కళేబరం మాయమైంది. అయితే ఘటనా స్థలంలో రక్తపు మరకలు ఉండటంతో వాటి ఆనవాళ్లను అధికారులు సేకరించి ఎఫ్ఎస్ఎల్ నివేదిక నిమిత్తం పంపినట్లు డిఆర్ఓ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలో చిరుత పులుల సంచారం లేదని ఇది బావురు పిల్లి అయి ఉంటుందని అటవీ శాఖా అధికారులు అంటున్నారు. అటవీ శాఖ అధికారుల దర్యాప్తులో మృతిచెందింది పులి పిల్ల లేదా బావురిపిల్లినా తేలాల్సిఉంది. ఈ ప్రాంతాన్ని సబ్ డీఫ్ఓ వేణుగోపాల్ రేంజర్ అధికారి నారాయణ పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి



ప్రజాశక్తి -వి కోట: మండల పరిధిలోని అన్నవరం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడిన సంఘటనలో ఓ రైతు మృతి చెందారు. పోలీసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం చిన్నాచ్లపల్లికి చెందిన చలపతి తమ పొలంలో పండిన పచ్చిమిరప కాయలను తన ద్విచక్రవాహనంలో వీకోట మార్కెట్‌కు తరలిస్తుండగా ప్రమాదవశాత్తు అన్నవరం సమీపంలో వాహనం అదుపు తప్పి కిందపడిపోయాడు. చలపతి వాహనంపై నుండి జారిపడటంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మధ్యాహ్నం సమయంలో మార్కెట్ సమయం మించిపోతుందన్న ఆందోళనలో ద్విచక్ర వాహనంపై రెండు బస్తాలు మిరపకాయలు తరలించడం ద్విచక్ర వాహనం అదుపుతప్పి రైతు మృతి చెందడం పట్ల స్థానికులను కలసివేసింది. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇండస్ట్రియల్ ఏరియా పరిశుభ్రంగా ఉంచాలి : కమిషనర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్ : నగరంలోని ఆటోనగర్‌కు పక్కన ఉన్న ఇండస్ట్రియల్ ఏరియాను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దుకాణదారులను నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. మంగళవారం ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియా, జీవకోన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు, రోడ్ల గుంతలు పూడ్చే విధానాన్ని ఆరోగ్యశాఖ, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియా లో రోడ్లపై పక్కన ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు, టైర్లు పడేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీఐఐసీ వారికి నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. యూజర్ ఛార్జీలు చెల్లిస్తే తాము పారిశుధ్య పనులు చేయడం జరుగుతుందన్నారు. నగరంలో 895 గుంతలను గుర్తించి, పూడిక పనులు చేస్తున్నామన్నారు. కమిషనర్ వెంట కార్పొరేటర్ అన్నా అనిత, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డి.ఈ. రమణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు

టీచర్ మంగమ్మ సేవలు మరువలేనిది : యుటిఎఫ్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఉపాధ్యాయుల సేవలు మరువలేమని, టీచర్ మంగమ్మ విద్యార్థుల భవిష్యత్ ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు శ్రమించారని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. సర్వేపల్లి రాధాక్రిష్ణన్ నగర పాలక ఉన్నత పాఠశాలలో సుదీర్ఘ కాలంగా ప్రధానో పాధ్యాయురాలుగా సేవలందించిన మంగమ్మను సత్కరించారు. జిల్లా కార్యదర్శి బండి మధుసూదన్ రెడ్డి, మండల గౌరవ అధ్యక్షురాలు వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఎస్.కే. బాష పాల్గొన్నారు.

భూసేకరణ, నిర్మాణ పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టు పనులు, తిరుపతి రేణిగుంట బైపాస్- రోడ్డుకు సంబంధించి పలు భూసంబంధిత పెండింగ్ అంశాలు, నిర్మాణ సమస్యలపై కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జేసీ శుభం బన్సల్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరుపతి, సూళ్ళూరుపేట, శ్రీకాళహస్తి ఆర్డీవోలు రామ్మోహన్, కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డిలకు దిశానిర్దేశం చేశారు. కడప – రేణిగుంట, తిరుపతి – మదనపల్లి, రేణిగుంట – నాయుడుపేట ఆరు లైన్ల రహదారుల నిర్మాణం, తిరుపతి బైపాస్ వేగవంతం చేయాలని, రేణిగుంట నుంచి చెన్నయ్ వరకూ నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనునలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

'కోఆప్‌టెక్స్' ను లాభాల్లోకి తెచ్చాం

ప్రజాశక్తి - తిరుపతి సిటి: గాంధీరోడ్డులో ఆధునీకరించిన కో ఆప్ టెక్స్ షోరూంను తమిళనాడు చేనేత, జౌళి శాఖ మంత్రి గాంధీ, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కలిసి ప్రారంభించారు. 40లక్షల రూపాయలతో ఇటీవల ఈ షోరూంను తమిళనాడు ప్రభుత్వం ఆధునీకరించింది. షోరూంను ప్రారంభించి షాపులో ఉన్న వివిధ రకాల వస్త్రాల ను మంత్రి పరిశీలించారు. తమిళనాడులో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధికారం చేపట్టే నాటికి కో ఆప్ టెక్స్ ఎనిమిది కోట్ల నష్టాల్లో ఉన్నట్లు మంత్రి గాంధీ తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో షోరూం లను ఆధునీకరించడం, ఉద్యోగులకు శిక్షణ వంటి చర్యలతో ప్రస్తుతం ఏటా 15కోట్ల లాభం ఆర్జిస్తున్నట్లు ఆయన చెప్పారు. దేశవ్యాప్తంగా 150 కో ఆప్ టెక్స్ షోరూం లు ఉండగా ప్రస్తుతం 48వాటిని ఆధునీకరించినట్లు ఆయన వివరించారు. నాణ్యమైన చేనేత వస్త్రాలకే కాకుండా అందుబాటు ధరలకు కో ఆప్ టెక్స్ మారుపేరని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఏపి ప్రభుత్వం కూడా ఆప్కో చేనేత వస్త్రాలకు ప్రసిద్ధని ఆయన చెబుతూ చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఆయన కోరారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కార్పోరేటర్ పొన్నాల చంద్ర తదితరులు పాల్గొన్నారు.